# రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు

- భీమిలి ఆర్అండ్‌బీ రహదారిపై దౌర్జన్యకాండ
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు


భీమిలి రోడ్డు అంచు వరకు వెలిసిన దుకాణాలు


హోట్‌స్టాల్ పక్కన మరొక వర్గం గ్రావెల్ వేసి ఫ్లెక్సీ కట్టిన దృశ్యం

**తగరపువలస:** తగరపువలస నుంచి భీమిలి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిని ఇరువైపులా ఉన్నవారు వాటాలేసి ఆక్రమించేసుకుంటున్నారు. డ్రైనేజీ అవతల ఉన్న వారు... ఇవతల వైపు రోడ్డును ఆనుకుని ఎదురుగా ఉన్న స్థలాలు తమ సొంతమంటూ చదును చేసి, దుకాణాలు ఏర్పాటు చేసేస్తున్నారు. వాటిని అద్దెకు ఇస్తూ దుకాణదారుల నుంచి భారీగా రూ.లక్షల్లో అడ్వాన్సులు, రూ.వేలల్లో అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. ఈ స్థలాల ఆక్రమణకు జరుగుతున్న కుమ్ములాటలో చిరు వ్యాపారులు నలిగిపోతున్నారు. 30 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రహదారి అంచుల వరకు దుకాణాలు రావడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. భవిష్యత్‌లో దురదృష్టవశాత్తూ వాహనాలకు బ్రేకులు ఫెయిల్ కావడమో, అదుపు తప్పడమో, మరే ప్రమాదమో జరిగితే రహదారికి ఇరువైపులా ఆక్రమణలో ఉన్న వ్యాపారులకు భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆర్ అండ్ బీ, వీఎంఆర్‌డీఏ రహదారుల విస్తరణకు చేసిన మార్కింగ్, ఏర్పాటు చేసిన పోల్స్‌కు లోపలే ఈ తతంగం అంతా రోజూ జరుగుతోంది. ఇందులో భాగంగా రోడ్డు మార్జిన్‌కు ఇరువైపులా ఉన్న వ్యాపారులే తరచూ ఒకరిపై ఒకరు జీవీఎంసీ, సచివాలయాలు, పోలీసులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

**పట్టించుకోని అధికారులు**

ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణాన్ని తొలగించాలని ఒక వర్గం స్పందనలో ఫిర్యాదు చేసి సఫలీకృతం కాగా... రెండు రోజుల క్రితం ఇక్కడ హోట్‌స్టాల్‌పై ఒక సామాజికవర్గ సభ్యులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. అందులోని సామగ్రి బయటకు విసిరేసి వారి దుకాణానికి అడ్డంగా గ్రావెల్ వేయడంతో ఇక్కడి వ్యాపారులు, ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. కంటి మీద కునుకు లేకుండా ప్రజాప్రతినిధులు, పోలీసులు, సచివాలయాలు, భీమిలి జోనల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది నామమాత్రంగా నోటీసులు జారీ చేసి అక్కడ జరుగుతున్న వీధి పోరాటాలను చూస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడంతో తగరపువలసను ఆనుకుని ఉన్న సంతపేటతోపాటు జీరుపేట, చిల్లపేట, మండల పరిధిలో ఉన్న బ్యాంకు కాలనీ, కీతిన్‌పేట గ్రామాల్లో రోజూ కొత్త దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత తలలు పట్టుకునే బదులు వాటిని నివారించే క్రమంలో ఆర్ అండ్ బీ రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాలను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మళ్లించాలని వాహనదారులు కోరుతున్నారు. సచివాలయ, టౌన్ ప్లానింగ్ అధికారులు రహదారులను ఆనుకుని ఉన్న వ్యాపారుల పట్ల వివక్ష చూపడం వల్లే కొందరికి మాత్రమే నోటీసులు జారీ చేసి మరి కొందరిని వెనకేసుకు వస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. వివాదాలు, ప్రమాదాలకు దూరంగా రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.


డ్రైనేజీ దాటి రహదారి వైపు ఏర్పాటు చేసిన దుకాణాలు

# దసరాలోపు బకాయిల చెల్లింపులు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో జ్యూట్‌మిల్లు యజమాని బజోరియా, కార్మిక సంఘ నాయకులు

**అంగీకరించిన జ్యూట్‌మిల్లు యజమాని బజోరియా**

**భీమునిపట్నం:** రాబోయే దసరాలోపు చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల మిగులు బకాయిలు చెల్లిస్తామని మిల్లు యజమాని కె.జె.బజోరియా అంగీకరించారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద మిల్లు యజమాని, కార్మిక సంఘ నాయకులతో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ ఇప్పటికి వరకూ 95 శాతం మంది కార్మికుల బకాయిల చెల్లింపులు జరిగాయని, ఇంకా అయిదు శాతం మంది మిగిలి ఉన్నారన్నారు. వారికి కూడా ఆలస్యం చేయకుండా దసరాలోపు పూర్తిగా చెల్లింపులు చేయాలని కోరారు. ఇదేకాకుండా మారు పేర్లతో కొందరు కార్మికులు పని చేశారని, వారి బకాయిలనూ చెల్లించాలని కోరారు. దీనిపై మిల్లు యజమాని బజోరియా స్పందిస్తూ జూట్‌మిల్లులో పని చేసిన ప్రతి కార్మికునికి తప్పనిసరిగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 95 శాతం బకాయిలు చెల్లించామని, ఇంకా మిగిలిన బకాయిలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరిన విధంగా దసరా కల్లా చెల్లించేస్తామని తెలిపారు. దీంతోపాటు మారు పేర్లతో పని చేసిన కార్మికులకు కూడా బకాయిలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో విశాఖ జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు, కార్మిక సంఘాల నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, మునకాల ఆదినారాయణ, దల్లి అప్పల రెడ్డి, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, అచ్చారావు, మద్దిల దేవుళ్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కనువిందు చేస్తున్న కమలాలు


చిట్టివలస పెద్ద చెరువులో కమలాలు

**తగరపువలస:** చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువులో కమలాలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువు మొత్తం బాగుచేసి తుప్పలతోపాటు తామర తూడులను కూడా తొలగించారు. కానీ నెల రోజులు గడవక ముందే తామర తంపర పెరిగి పెద్ద పెద్ద పువ్వులు బయటకు కనిపిస్తున్నాయి. చెరువు రోడ్డు ద్వారా రాకపోకలు సాగించే వారు వికసించిన తామర పువ్వులను చూసి పరవశులవుతున్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**తగరపువలస:** భీమిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ యు.సకరయ్య తెలిపారు. ఈ అంతరాయం కారణంగా జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, 33 కేవీ ఆనందపురం – ఐఎన్ఎస్ కళింగ లైన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

**కొమ్మాది:** జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలస కాలనీలో జీవీఎంసీ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులకు, అదేవిధంగా చేపలుప్పాడ, పెద్ద ఉప్పాడ గ్రామానికి రూ.20 లక్షల వ్యయంతో కొత్తగా మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులకు గురువారం వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 23న సామాజిక తనిఖీ

**పద్మనాభం:** ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఈ నెల 23న నిర్వహించనున్న సామాజిక తనిఖీకి అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉపాధి హామీ పథకం వీఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడాడు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 ఏప్రిల్ 31 వరకు ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖల ద్వారా చేపట్టిన పనులకు రికార్డులు పక్కాగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీవో జి.వరలక్ష్మి, ఈసీ తులసి, వీఆర్పీలు పాల్గొన్నారు.

### చీమల మందు తాగి వృద్ధుడు మృతి

**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ రామాలయం వీధికి చెందిన దల్లి అప్పన్న (64) అనే వృద్ధుడు చీమల మందు తాగి మృతి చెందిన సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుని కుమారుడు చిట్టిబాబు భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రకారం... ఈ నెల 13 నుంచి అప్పన్న వరుసగా మూడు రోజులపాటు మద్యం సేవించాడు. ఆ మత్తులో 15న సాయంత్రం చీమల మందు తాగేయగా వాంతులు అయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యుని సాయంతో చీమల మందు కక్కించి వైద్యం అందించారు. కోలుకున్న అప్పన్న తిరిగి 16న మధ్యాహ్నం 12 గంటలకు వాంతులు చేసుకోవడంతో తగరపువలసలోని నర్సింగ్ హోమ్‌కు తరలించారు. అక్కడ ఆరోగ్యం విషమించడంతో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా... అప్పటికే అప్పన్న మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గైస్ పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

**మురళీనగర్:** కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1971–1975 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కాలేజీలోని అన్ని బ్రాంచీలకు చెందిన టాపర్లకు ప్రోత్సాహక బహుమతులతోపాటు కాలేజీ ఫైనలియర్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. బ్రాంచీల వారీగా బాలికలు, బాలురుల్లో టాపర్‌తోపాటు కాలేజీ టాపర్స్ రూ.10,000 చొప్పున నగదు బహుమతులను పూర్వ విద్యార్థులు అందజేస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, డీఈవో చంద్రకళ

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ మూడో వార్డు వైజాగ్ రోడ్డు (గొల్లల పాలెం) ప్రాథమిక పాఠశాలను సర్వ శిక్ష అదనపు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, డీఈవో ఎల్.చంద్రకళ ఆకస్మికంగా గురువారం సందర్శించారు. తరగతుల నిర్వహణ, సిలబస్‌పై ఉపాధ్యాయులతో మాట్లాడారు. చదువులో వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు.

# వర్షంతో వరి నాట్లకు మేలు

**పద్మనాభం:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురవడంతో వరి సాగు చేస్తున్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గత వారం రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో వరి నాట్లు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 6,479 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా ఖరీఫ్‌లో 2,679 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, పాండ్రంగి, విలాస్కాన్‌పాలెం, పద్మనాభం తదితర వ్యవసాయ పంపుసెట్లు గల గ్రామాల్లో ఈ నాట్లు వేశారు. ఇంకా 3,332 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉంది. దీనికి రైతులు ఊబాలు వేయడానికి నారు సిద్ధం చేసి ఉంచారు. గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది వరకు వర్షం కురిసింది. ఈ వర్షానికి ఇంత వరకు వేసిన వరి నాట్లు జీవం పోసుకున్నాయని... వరి నారు ఊపిరి పోసుకుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**తగరపువలస:** భీమిలి డివిజన్‌లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జోరున వర్షం కురవడంతో పలుచోట్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి

**విశాఖ లీగల్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రీడింగ్ రూమ్‌లో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ మాట్లాడుతూ బాలకార్మిక చట్టం, కనీస వేతనాల చట్టం మీద ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. కార్మికశాఖ అసిస్టెంటు కమిషనర్ ఎస్.మోహన్‌లక్ష్మి, అసిస్టెంటు లేబర్ ఆఫీసర్లు బి.అరుణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.విజయలక్ష్మి, కె.మనోజ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సదుపాయం కల్పించాలని వినతి

**తగరపువలస:** జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌కు విద్యుత్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు. గ్రామ శివారులో ఉన్న ఈ షెల్టర్ వద్ద చీకటి పడిన తర్వాత ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ వుంటున్నారు. ఆకతాయిల బెడదతోపాటు విష పురుగుల సంచారం ఎక్కువగా ఉన్నందున కనీసం షెల్టర్ పక్క స్తంభానికి విద్యుత్ దీపాలు అమర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


విద్యుత్ సదుపాయం లేని బంగ్లామెట్ట బస్ షెల్టర్

# మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రజల మనోగతం
- అవినీతికి తావులేకుండా పథకాలు అందిస్తున్నాం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


బింద్రానగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

**మధురవాడ:** ''మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రావాలి... అందుకోసం అందరం ఐక్యంగా పని చేస్తాం'' అని బింద్రానగర్‌కి చెందిన సత్యనారాయణ, ఓ దివ్యాంగుడు మురళి అన్నారు. తనకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, రైతు భరోసా, సున్నా వడ్డీ, ఇంటి స్థలం వంటి వాటి ద్వారా రూ.10.36 లక్షల లబ్ధి చేకూరిందని పొట్నూరు భవానీ ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలుస్తామని ఆమె పేర్కొన్నారు. జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మునుపెన్నడూ లేని విధంగా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించడం ద్వారా మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, రామ రాజు లే అవుట్‌లో కూలేందుకు సిద్ధంగా ఉన్న కల్వర్టు బ్రిడ్జిని పునర్నిర్మించాలని, మిథిలాపురి వుడా కాలనీ బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, అల్లూరి సీతారామరాజు పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన ఆయా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, సత్యనారాయణ, వార్డుల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఎమ్.రాజేశ్వరి, ఎమ్‌వీ రమణమూర్తి, ప్రభుత్వ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

# ప్యాకేజీ స్టార్ పవన్‌ను ప్రజలు పట్టించుకోరు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**పీఎం పాలెం:** రాష్ట్రంలోని ప్రాంతాల భౌగోళిక పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా ఇష్టానుసారంగా నోటికి వచ్చినట్టు మాటాడుతున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాజకీయ నాయకునిగా అత్యంత అల్పుడని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ గాదె రోశిరెడ్డి అన్నారు. పీఎం పాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుషికొండపై నిబంధనలకు లోబడే ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నారన్నారు. అసహనంతో పవన్ మాట్లాడితే ప్రజలు కనీసం పట్టించుకోరన్నారు. గత ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పే పునరావృతం అవుతుందన్నారు. జన నేత సీఎం జగన్ నీడను కూడా ప్యాకేజీ స్టార్ తాకలేడని విమర్శించారు. వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంకను విమర్శించే అర్హత అమావాస్య చంద్రుడికి లేదన్నారు. గతం మరిచిపోయి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై వాగితే సహించేది లేదన్నారు. ఎమ్మెల్యే పీఏగా చంద్రరావు సాగించిన అవకతవకలు ఏదో ఒక రోజు అమావాస్య చంద్రుడి కొంప ముంచక తప్పవన్నారు. సమావేశంలో పోతిన ప్రసాదు, ఎల్లాజీ, వరలక్ష్మి, రాయన సాయికుమార్, జామి శివ, రవి తదితరులు ప్రసంగించారు.

# విద్యుత్ దీపాల పునరుద్ధరణ

**తగరపువలస:** భీమిలి జోన్ 1, 2 వార్డుల్లో పలుచోట్ల విద్యుత్ దీపాలు గురువారం జోరుగా పునరుద్ధరించారు. ఇటీవల విద్యుత్ దీపాలు వెలగడం లేదంటూ వరుసగా సాక్షిలో ప్రచురితమైన వార్తలకు ఈఈ వేంకటేశ్వరరావు స్పందించి వార్డులో తనిఖీలు చేపట్టారు. వెలగని, పాక్షికంగా వెలుగుతున్న విద్యుత్ దీపాలను సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో మెయిన్‌రోడ్డు, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో క్రేన్ సాయంతో విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు.


తగరపువలస మెయిన్‌రోడ్డులో విద్యుత్ దీపాలు పునరుద్ధరిస్తున్న సిబ్బంది

# బౌద్ధారామాలను పరిరక్షించాలి

**కొమ్మాది:** బీచ్‌రోడ్డులో గల బావికొండ, తొట్లకొండ, భీమిలిలో గల పావురాల కొండపై గల బౌద్ధారామాలను పరిరక్షించాలని బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కోరారు. గురువారం ఈ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం కల్పించి, రహదారులు నిర్మించాలని, తొట్లకొండపై నిర్మించిన మ్యూజియం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బౌద్ధారామాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర కోశాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బావికొండపై బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, తదితరులు

# బీఐఎస్ అవగాహన ఒప్పందం

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ సంతకాలు చేశారు. రెండు సంస్థలు సంయుక్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, సింపోజియంలను నిర్వహించనున్నాయి. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల నిర్వహణ, భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే దిశగా నిర్ణయం తీసుకున్నారు. స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధిత తరగతులను సంయుక్తంగా నిర్వహించనున్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

# అనధికారిక అంతస్తుల కూల్చివేత

**ఆరిలోవ:** జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారిక భవన నిర్మాణాలపై కన్నెర్ర చేశారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను కొద్ది రోజులుగా తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో రెండు చోట్ల అనధికారికంగా నిర్మించిన అదనపు అంతస్తులను కూల్చివేశారు. ఆయా చోట్ల అనధికార నిర్మాణాలు జరుగుతున్నట్టు గుర్తించిన జీవీఎంసీ రెండో జోన్ ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాలతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, స్క్వాడ్ బృందంతో వెళ్లారు. జాతీయ రహదారిని ఆనుకుని వెటర్నరీ కాలనీలో ఓ వ్యక్తి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని, అనధికారికంగా ఐదో అంతస్తు నిర్మాణం చేపట్టాడు. ఆ అదనపు అంతస్తును స్క్వాడ్ బృందం తొలగించింది. అనంతరం దీనికి సమీపంలో ఎస్టీ కాలనీలో ఓ వ్యక్తి కూడా నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని అనధికారికంగా ఐదో ఫ్లోర్ నిర్మించేశాడు. ఆ ఫ్లోర్‌ను కూడా సిబ్బంది తొలగించారు. అనుమతులు ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఏసీపీ వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా సూచించారు. అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను ఏ స్థాయి వ్యక్తులకు సంబంధించినవైనా తొలగించేస్తామని ఆయన హెచ్చరించారు.

# కనకమహాలక్ష్మికి ఘనంగా తులసి పూజ

**దాబాగార్డెన్స్ :** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు క్షీరాభిషేక సేవ..**

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.


సహస్ర తులసి పూజలో సిరులతల్లి